సాక్షి
పల్నాడు

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



దుర్గమ్మకు వెండి దీపకుందులు

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు మంగళవారం వెండి దీప కుందులను కానుకగా సమర్పించారు.



కేడీసీసీబీకి నాఫ్స్కాబ్ అవార్డు

విజయవాడ : ఉత్తమ జిల్లా సహకార కేంద్ర బ్యాంకుగా కేడీసీసీబీ నాఫ్స్కాబ్(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్స్ కో ఆపరేటివ్ బ్యాంక్స్ లిమిటెడ్) అవార్డుకు ఎంపికైంది.

కూరగాయల అలంకరణలో గణపయ్య



పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలో వాసవి యూత్ ఆధ్వర్యంలో 25వ శ్రీ విజయ గణపతి స్వామి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం స్వామిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు.

పంచప్రాణాలు పంచి..



దివికేగిన యువకుడు

- తాను మరణించినా మరో ఐదుగురికి జీవితం
- బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవదానం
- ఆదర్శ నిర్ణయం తీసుకున్న తల్లిదండ్రులు



బిడ్డా చల్ల'గుండె': కుమారుడి గుండెకు వీడ్కోలు పలుకుతున్న తల్లిదండ్రులు కట్టా రాజు, మల్లేశ్వరి చిత్రంలో సోదరులు సంతోష్, అభిషేక్ (అంతరచిత్రం) కృష్ణ గుండెను హెలికాప్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

మరణశయ్యపై అచేతనంగా పడి ఉన్న కొడుకును చూసి కన్నపేగు కదిలి కదిలి కలచివేస్తున్నా.. దుఃఖం పొగిలి పొగిలి తన్నుకొస్తున్నా.. తీరని కడుపుకోత దావానలంలా తనువులను దహించి వేస్తున్నా.. విధిపై ఆక్రోశం కన్నీటిధారలు కడుతున్నా.. అంతరంగాన రేగిన ఆర్తనాదం నిశ్శబ్దంగా దేహాలను కంపింపజేస్తున్నా.. గుండెలను పిండేసే పెనువిషాదాన్ని పంటి బిగువనే భరిస్తూ ఆ తల్లిదండ్రులు కొండంత ఔదార్యం చూపారు. తమ కొడుకు చనిపోయినా మరికొందరికి పునర్జన్మనివ్వాలని తలంచారు. అవయవదానానికి అంగీకరించి ఆదర్శమూర్తులుగా నిలిచారు.

గుంటూరు మెడికల్, చిలకలూరిపేట: పల్నాడు జిల్లా చిలకలూరిపేట శాంతినగర్‌కు చెందిన కట్టా రాజు, మల్లేశ్వరి దంపతులకు ముగ్గురు సంతానం. రాజు తోపుడుబండిపై కూరగాయలు అమ్ముతూ, ఆటో నడుపుతూ ముగ్గురు పిల్లలను చదివిస్తున్నాడు. ప్రథమ సంతానం కృష్ణ (18) ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండో కుమారుడు సంతోష్ తొమ్మిదో తరగతి, మూడో కుమారుడు అభిషేక్ 8వ తరగతి చదువుతున్నారు. ఈనెల 23న కాలేజీకి వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉన్న సమయంలో కృష్ణను ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో కృష్ణ తలకు బలమైన గాయం కావడంతో తల్లిదండ్రులు అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు రమేష్ హాస్పిటల్‌కి తరలించారు. కృష్ణకు ఈనెల 25న బ్రెయిన్ డెడ్ అయింది. ఈ విషయాన్ని ఆస్పత్రి వైద్యులు తల్లిదండ్రులకు తెలియజేయడంతో గుండెలవిసేలా రోదించారు. చేతికంది వచ్చిన బిడ్డ తమను చూసుకుంటాడనుకునే సమయంలో ఇలా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో కన్నీరుమున్నీరయ్యారు. అంతటి బాధలోనూ తల్లిదండ్రులు గుండెను దిటవు చేసుకుని తమ బిడ్డ మరణం మరికొందరికి జీవితం ప్రసాదించాలని నిర్ణయించుకున్నారు. బిడ్డ అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. కృష్ణ ఈనెల 19న తన 18వ పుట్టిన రోజు జరుపుకున్నాడు. పుట్టినరోజు జరుపుకున్న నాలుగురోజుల్లోనే ఇలా జరుగుతుందని ఊహించలేదని తల్లిదండ్రులు, స్నేహితులు విలపిస్తున్నారు.



కట్టుదిట్ట భద్రత మధ్య కృష్ణ గుండెను తరలిస్తున్న వైద్యులు

ఐదుగురికి పునర్జన్మ

కృష్ణ నేత్రాలు గుంటూరు సుదర్శిని కంటి ఆస్పత్రికి, లివర్‌ను విశాఖపట్నం కిమ్స్ హాస్పిటల్‌కు, ఒక కిడ్నీని విజయవాడ ఆయుష్ హాస్పిటల్‌కు, మరో కిడ్నిని రమేష్ హాస్పిటల్‌కు, గుండెను తిరుపతి పద్మావతి హాస్పిటల్‌కి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా, గ్రీన్‌చానల్‌లో తరలించారు. ఇప్పటికే తీవ్ర అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉండి అవయవ మార్పిడి కోసం ఎదురు చూస్తున్న ఐదుగురికి జీవితాలను ప్రసాదించనున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

తిరుపతి వ్యక్తికి గుండె

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి తిరుపతిలో గుండె మార్పిడి అవసరమైన వ్యక్తి కోసం గుంటూరు నుంచి ప్రత్యేక హెలీకాప్టర్ ద్వారా గుండెను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. రోడ్డు మార్గం ద్వారా తరలించేసరికి విలువైన సమయం వృథా అవుతుందని ఆగమేఘాల మీద హెలీకాప్టర్‌ను రప్పించి, గ్రీన్ చానెల్ ద్వారా శస్త్ర చికిత్సకు మార్గం సుగమం చేశారు.

మరణంలోనూ పరోపకారం



కట్టా కృష్ణ నాకు మంచి మిత్రుడు. చిన్ననాటి నుంచి కలుపుగోలు స్వభావం కలిగినవాడు. ఇతరులకు సహాయం చేసే విషయంలో ఎప్పుడూ ముందుంటాడు. చివరకు మరణంలోనూ ఇతరులకు సహాయపడ్డాడు. మిత్రుడి మరణం తీవ్ర బాధ కలిగిస్తున్నా అతను చనిపోయినా ఇతరులకు ప్రాణదానం చేయడం గర్వంగా ఉంది.

– పాలపర్తి మోహనవంశీ, స్నేహితుడు

మంచితనానికి మారుపేరు



కృష్ణ మంచితనానికి మారుపేరు. బంధువులందరితో కలుపుగోలుగా ఉండేవాడు. ఈనెల 19న సంతోషంగా పుట్టిన రోజు జరుపుకున్నాడు. రోజుల వ్యవధిలోనే అందరినీ విడిచి కానరాని లోకాలకు వెళ్లడం మనసును కలచివేస్తోంది. అవయవ దానం ద్వారా ఐదుగురికి కొత్త జీవితాలు ఇచ్చిన కృష్ణతో స్నేహం, బంధుత్వం పంచుకోవడం గర్వంగా భావిస్తున్నా.

– పాలపర్తి నాని, స్నేహితుడు, మేనమామ కుమారుడు

నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు కాయకల్ప అవార్డు

పలు పీహెచ్‌సీలకూ పురస్కారాలు



డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాల

నరసరావుపేట: స్థానిక లింగంగుంట్ల ఎస్‌ఎస్పీ కాలనీలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాల పర్యావరణానికి అనుకూలమైన (ఎకో ఫ్రెండ్లీ) హాస్పిటల్‌గా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. 2022–23 ఏడాదికి కాయకల్ప అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు న్యూఢిల్లీలోని నేషనల్ హెల్త్ మిషన్ ప్రకటించినట్లు జిల్లా ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షక అధికారి డాక్టర్ బీవీ రంగారావు మంగళవారం వెల్లడించారు. వినుకొండ వైద్యశాల రాష్ట్ర స్థాయిలో బెస్ట్ సీహెచ్‌సీ అవార్డును, రొంపిచర్ల పీహెచ్‌సీ రన్నర్ ఆఫ్ పీహెచ్‌సీ అవార్డును, లింగంగుంట్ల పరిధిలోని కావూరు పీహెచ్‌సీ బెస్ట్ హెచ్ డబ్ల్యూసీ అవార్డును పొందినట్లు వివరించారు. నేషనల్ హెల్త్ మిషన్‌కు జిల్లా కన్వీనర్‌గా కలెక్టర్ ఎల్.శివశంకర్ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అవార్డులు రావడంతో వినుకొండ, నరసరావుపేట సూపరింటెండెంట్లు డాక్టర్ మంత్రూనాయక్, డాక్టర్ షేక్ అబ్దుల్‌రజాక్, జిల్లా క్వాలిటీ మేనేజర్ రామప్రసాద్, ఆయా వైద్యశాలల డాక్టర్లను కలెక్టర్ అభినందించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 524.70 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 854.30 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 24,497, రోజా నుంచి 2,264 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

న్యూస్‌రీల్

వైభవంగా నృసింహుని పవిత్రోత్సవాలు



మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పవిత్రోత్సవాలలో భాగంగా మూడో రోజు మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు మూలవరులకు స్థపన, అగ్నిహోమం, స్వామి వార్లకు పవిత్ర సమర్పణ, హోమాలు, అష్టారీతి, పారమాత్మిక హోమాలు, పరివార దేవతలకు పవిత్ర సమర్పణ, ప్రసాదగోష్టి జరిగాయి. సాయంత్రం నిత్యహోమం, పంచసూక్త హోమం, మహాశాంతి హోమాలు నిర్వహించారు భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాలను ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

28 నుంచి నరసరావుపేట ఎల్‌సీ గేటు మూత

లక్ష్మీపురం(గుంటూరు): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నరసరావుపేటలో డబ్లింగ్ పనుల వల్ల ఈనెల 28 నుంచి అక్టోబర్ 1 వరకు ఎల్‌సీ గేటును మూసివేయనున్నట్లు రైల్వే శాఖ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. సాతులూరు–నరసరావుపేట–మనుమాక మధ్య డబ్లింగ్ పనుల జరుగుతున్న నేపథ్యంలో గేటును మూసివేస్తున్నట్లు వివరించారు. వాహనదారులు గమనించాలని కోరారు.

జాబ్‌మేళా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వేమూరు: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 29న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. దీనికి సంబంధించి వాల్‌పోస్టర్లను మంగళవారం ఆయన గుంటూరులోని తన స్వగృహంలో ఆవిష్కరించారు. జాబ్ మేళాకు 20 కంపెనీలు తరలివస్తాయని, 950 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే ఆస్కారం ఉందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు చెప్పారు. జీతం వారి విద్యార్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ. 30 వేల వరకు ఉంటుందని వివరించారు. నిరుద్యోగులు ఈ జాబ్ మేళాను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రవికుమార్, బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏడు మండలాల్లో వర్షం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు ఏడు మండలాల్లో వర్షం పడింది. పొన్నూరు మండలంలో 16.4 మిల్లీమీటర్లు, పెదకాకాని 7, గుంటూరు పశ్చిమ 5.2, గుంటూరు తూర్పు 5, వట్టిచెరుకూరు 3.2, తాడేపల్లి 1.8, ప్రత్తిపాడు మండలంలో 1 మి.మీ చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ మాసం 26వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 121.8 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 187.6 మి.మీ వర్షపాతం నమోదైంది. రాగల రెండు రోజులూ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.6,000, మోడల్ ధర రూ.5,000 వరకు పలికింది.

గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి

- చెరువులో మునిగి ముగ్గురు మృత్యువాత
- అందరూ వలస కార్మికులే
- గణపవరం గ్రామంలో దుర్ఘటన

నాదెండ్ల: వినాయకుని విగ్రహం నిమజ్జనం చేసేందుకు చెరువులోకి దిగిన ముగ్గురు మృత్యువాత పడిన ఘటన గణపవరం గ్రామంలో సోమవారం జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం వలస వచ్చి కూలిపని చేసుకుని జీవిస్తున్న మూడు కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం.. గణపవరంలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో బేల్‌దారీ కార్మికుడిగా మహారాష్ట్రకు చెందిన ముఖేష్‌మోతిరామ్ ఖోటే (39) పనిచేస్తుంటాడు. ప్రకాశం జిల్లా మార్కాపురం గ్రామానికి చెందిన భాగ్యం ప్రవీణ్ (18), శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం బొమ్మిడివానిపేటకు చెందిన కోన వసంతకుమార్ (18) తల్లిదండ్రులు కంపెనీ క్వార్టర్లలో నివాసం ఉంటూ అక్కడే కూలీలుగా పని చేస్తుంటారు. ప్రవీణ్, వసంత్‌కుమార్ ప్రస్తుతం ఖాళీగానే ఉంటున్నారు. వినాయక చవితి సందర్భంగా ముఖేష్ ఇంట్లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు సోమవారం ముఖేష్, ప్రవీణ్, వసంత్ వేలూరు రోడ్డులోని ప్రభువు చెరువుకు సాయంత్రం 6 గంటలకు వెళ్ళారు. 9 గంటలైనా ముగ్గురూ తిరిగి రాకపోయేసరికి ప్రవీణ్, వసంత్ తల్లిదండ్రులు ఆందోళనకు గురై చెరువు వద్దకు వెళ్ళారు. అక్కడ వారి చెప్పులు, బైక్, సైకిల్, సెల్‌ఫోన్లు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో గాలించగా రాత్రి 11 గంటల సమయంలో భాగ్యం ప్రవీణ్ మృతదేహం లభించింది. అర్ధరాత్రి ఒంటి గంట వరకూ వెతికినా మిగిలిన వారి జాడ కానరాక పోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. ఉదయాన్నే మళ్లీ గాలింపు చేపట్టగా ముఖేష్ మోతిరామ్‌ఖోటే మృతదేహం లభ్యమైంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కోన వసంతకుమార్ మృతదేహం లభ్యమైంది. ముగ్గురి మృతదేహాలను చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రూరల్ ఎస్సై రాజేష్ కేసు నమోదు చేశారు.



చెరువు వద్ద గాలింపు చర్యలను పరిశీలిస్తున్న కుటుంబ సభ్యులు, స్థానికులు

అడుగు విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్ళి..

వినాయక చవితి సందర్భంగా ముఖేష్ నివాసంలో అడుగు ఎత్తు గల వినాయకుని విగ్రహం ఏర్పాటు చేసి సోమవారం వరకూ పూజలు జరిపారు. మహారాష్ట్రలో నివాసం ఉండే తల్లి మృతి చెందిందని కబురు రావటంతో పూజలు నిలిపివేసి వినాయకుని నిమజ్జనం చేసేందుకు క్వార్టర్లలో ఉండే ప్రవీణ్, వసంత్ సహాయం కోరాడు ముఖేష్. తాను సైకిల్‌పై, ప్రవీణ్, వసంతకుమార్ ఇద్దరూ బైక్‌పై విగ్రహాన్ని తీసుకుని చెరువు వద్దకు వెళ్ళారు. ముగ్గురూ ఎంతసేపటికీ తిరిగి రాకపోయేసరికి 9 గంటల సమయంలో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ చెరువు వద్దకు వెళ్లి అందులో మునిగినట్లు గుర్తించారు.



కోన వసంత్ మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి రామారావు

అనాథలుగా ముగ్గురు చిన్నారులు



ముఖేష్‌మోతిరామ్ ఖోటే ముగ్గురు పిల్లలతో ఏడాది క్రితం గణపవరం వచ్చి స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తూ క్వార్టర్లలో ముగ్గురు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఈయన భార్య రెండేళ్ల క్రితం వదిలి వెళ్లిపోయింది. ఇద్దరు చిన్నారులు గ్రామంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. మూడో చిన్నారి రెండేళ్ల పాప కావటంతో ముఖేష్ అల్లారుముద్దుగా పెంచుతున్నాడు. తండ్రి మృతితో ముగ్గురు చిన్నారులు అనాథలుగా మారారు.

ఐటీఐ పాసై ఉద్యోగ వేటలో ఉండగా..



శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలస మండలం దమ్మిడివానిపేట గ్రామానికి చెందిన కోన రామారావు పదేళ్లుగా స్థానిక కంపెనీ క్వార్టర్లలో ఉంటూ పనులకు కావలసిన కూలీలను సరఫరా చేసే మేస్త్రీగా వ్యవహరిస్తున్నాడు. ఈయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు వసంత్‌కుమార్ చిలకలూరిపేటలోని ఏఎంజీలో ఐటీఐ ఎలక్ట్రికల్ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఉద్యోగ వేటలో ఉన్నాడు. అతను ఇప్పుడు మరణించడంతో రామారావుతోపాటు ఆయన భార్య గుండెలవిసేలా రోదిస్తున్నారు.

సాయంగా వెళ్లి..



ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణానికి చెందిన భాగ్యం పుల్లయ్య, విజయమ్మ దంపతులు నాలుగేళ్లుగా కంపెనీ క్వార్టర్లలో నివాసం ఉంటూ పనులకు వెళ్తున్నారు. స్వస్థలంలో ఎలాంటి పనులు లేకపోవటంతో నాలుగేళ్ళ క్రితం వలస కార్మికులుగా వచ్చి పనిచేసుకుంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం కాగా, పెద్దకుమారుడు ఉద్యోగం చేస్తున్నాడు. ప్రవీణ్ చదువు పూర్తి చేసి తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ప్రవీణ్ ముఖేష్‌కు సాయంగా వెళ్లి మృతి చెందడంతో పుల్లయ్య, విజయమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మహిళా కూలీల దుర్మరణం



దొడ్డ సువార్త



బిల్లా ప్రభావతి

మేడికొండూరు: మందపాడు గ్రామంలో మంగళవారం పిడుగుపాటుకు ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం పాలయ్యారు. గ్రామానికి చెందిన దొడ్డ సువార్త (45), బిల్లా ప్రభావతి (22) గ్రామంలోని మిరప మొక్కలు నాటేందుకు వెళ్లారు. పని చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగుపడడంతో ఘటనా స్థలంలోనే మహిళలు మృతిచెందారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. తహసీల్దారు శ్రీనివాసశర్మ బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయం అందజేశారు. మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 4,012 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 236, బ్యాంక్ కెనాల్‌కు 1,343, తూర్పు కెనాల్‌కు 454, పశ్చిమ కెనాల్‌కు 154, నిజాంపట్నం కాలువకు 328, కొమ్మమూరు కాల్వకు 2,080 క్యూసెక్కులు విడుదల చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వరం

- వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు
- బుచ్చిబాపన్నపాలెంలో పైలెట్ ప్రాజెక్టు వైద్యశిబిరం పరిశీలన



శిబిరంలో కంటి పరీక్షను పరిశీలిస్తున్న కృష్ణబాబు, కలెక్టర్ శివశంకర్

రొంపిచర్ల: చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకూ గ్రామీణులు పట్టణాలకు పరిగెత్తి కాలం, డబ్బులు వృథా చేసుకోకుండా స్థానికంగానే మెరుగైన వైద్యం అందజేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు చెప్పారు. ఆరోగ్య సురక్ష అమలు తీరులో భాగంగా జిల్లాలోని రొంపిచర్ల మండలం బుచ్చిబాపన్నపాలెంలో మంగళవారం పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరాన్ని కృష్ణబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కృష్ణబాబు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష పేదలకు వరంలాంటిందని పేర్కొన్నారు. కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఈనెల 30 నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా మందులు, వైద్యుల అందుబాటుపై పరిశీలనకు కృష్ణబాబు వచ్చినట్లు వెల్లడించారు. జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతానికి అందరం సమష్టిగా కృషి చేద్దామని చెప్పారు. ఈనెల 30న మొదటి వైద్యశిబిరం కూడా ఈ గ్రామంలోనే నిర్వహిస్తామని వెల్లడించారు.



బీపీ పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్ శివశంకర్, ఎండీ మురళీధర్‌రెడ్డి

శిబిరంలో కలెక్టర్‌తోపాటు ఏపీ స్టేట్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఎండీ మురళీధర్‌రెడ్డి బీపీ పరీక్ష చేయించుకున్నారు. అలాగే నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డిపేట పీహెచ్‌సీలో వైద్యసేవల తీరును కృష్ణబాబు, కలెక్టర్ పరిశీలించారు. సమీపంలోని ఇళ్లకు వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే తీరుపై ఆరా తీశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ నివాస్, అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ, డీఎండీ హెచ్‌వో రవి, జిల్లా ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షణాధికారి రంగారావు, జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్హులకు సంక్షేమ పథకాలు అందితేనే సార్థకత



చీరాలటౌన్: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందరూ పొందాలి.. సంచార జాతుల ప్రజలు చదువుకుని తమకు ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రోగ్రాం మేనేజర్ రమణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక డోలా ఐజాక్ ఎన్జీఓ భవనంలో సంచార జాతుల ప్రజలకు అధికారులతో కలిసి ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రోగ్రాం మేనేజర్ మాట్లాడుతూ ఊరూరా తిరుగుతూ వివిధ రకాల వస్తువులు అమ్మకాలు చేస్తూ జీవనం సాగించే సంచార జాతుల ప్రజలకు సక్రమంగా పథకాలు అందలేకపోతున్నాయన్నారు. సంచార జాతులకు పూర్తిస్థాయిలో పథకాలు అందిస్తేనే పథకాలకు సార్థకత లభిస్తుందన్నారు. సమాజంలో అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి పథంలో ముందుండాలంటే వివక్షతలు లేకుండా ఉండాలన్నారు. సంచార జాతుల ప్రజలు తమ వృత్తిలో నైపుణ్యాలు పెంపొందించుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఎంపీడీఓ కె.నేతాజీ మాట్లాడుతూ చీరాల మండలంలోని గ్రామాల్లో నివాసం ఉంటున్న సంచార జాతుల ప్రజలు అందరికీ సంక్షేమ పథకాలు అందేలా తన వంతుగా కృషి చేస్తానన్నారు. మున్సిపల్ కార్యాలయం మేనేజర్ శ్యామలాదేవి, సబ్‌యూనిట్ హెల్త్ ఆఫీసర్ శేషుబాబు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రామకృష్ణ, రీజనల్ కో–ఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఉత్తమ ఆసుపత్రిగా నిలపండి

- పేదలకు మెరుగైన సేవలందించండి.
- డీసీహెచ్ఎస్ సీహెచ్ రంగారావు

మాచర్ల: రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతంలో ఉన్న మాచర్ల కమ్యూనిటీ ఆసుపత్రి ఇప్పటికే ప్రథమ స్థానం సాధించిందని, మరింతగా సమష్టిగా కృషి చేసి పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించేలా కృషి చేయాలని పల్నాడు జిల్లా వైద్యశాఖ కో ఆర్డినేటర్ (డీసీహెచ్ఎస్) సీహెచ్ రంగారావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భవ ప్రత్యేక శిబిరాన్ని రంగారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, ప్రభుత్వాసుపత్రుల వర్కింగ్ ప్రెసిడెంట్ కె రామకోటయ్య, సూపరింటెండెంట్ ఉదయభానులు ప్రారంభించారు. చెవి, చిన్న పిల్లలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. సమావేశంలో రంగారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉచిత, ప్రత్యేక వైద్యమందిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎక్కడ రాజీ పడకుండా, నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరికీ అన్నీ రకాలుగా వైద్యం అందించాలన్నారు. చిన్న చిన్న లోపాలున్నా సరిదిద్దుకొని గతంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్థానం పొందిన కమ్యూనిటీ ఆసుపత్రిని జాతీయ స్థానంలో ప్రథమంగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. అవసరమైన సౌకర్యాలు, ప్రత్యేక వైద్యులను తీసుకుంటామన్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చొరవతో 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి అయిందని, త్వరలో 100 పడకల ఆసుపత్రిగా వచ్చే అవకాశముందన్నారు. బ్లడ్ బ్యాంక్ స్టోరేజ్ కేంద్రం వచ్చే అవకాశముందన్నారు. ఏ ఒక్కరూ అనవసరమైన ఆరోపణలకు తావివ్వకుండా ప్రజలకు వైద్యమందించటం ద్వారా సేవలందించాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉత్తమ వైద్యం అందించాలని, జాతీయ స్థాయిలో పేరు తెస్తే రూ.లక్ష నగదు అందిస్తానని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కార్యక్రమంలో వైద్యులు రేవతి, కె ఆశీర్వాదం, సురేష్, లావణ్య, దినేష్, మురళి, జయప్రకాష్, వంశీ తదితరులుతోపాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్య శాఖ కో ఆర్డినేటర్ సీహెచ్ రంగారావు

సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ

మాచర్ల: బడుగు బలహీనవర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన చాకలి ఐలమ్మను తలచుకొని స్మరించుకోవటం గొప్ప విషయమని చాకలి ఐలమ్మ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మన్నెం పాండు రంగారావు, జెడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రజక సంఘం గండూరి ఈశ్వరయ్య, సంఘ పెద్దలు ఆవుల మంద రామస్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, న్యాయవాది ఆవుల ఉదయకుమార్‌రెడ్డి, జలగం వెంకటేశ్వర్లు, షేక్ అన్వర్ బాషా, పరిటాల, కిరణ్, కొండవీటి రాఘవయ్య పాల్గొని ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జిల్లాలో వీర వితంతువులు, మాతలకు ఇంటిస్థలం

- జిల్లా సైనిక్ బోర్డు తొలి సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాదు
- మాజీ సైనికోద్యోగుల సంక్షేమానికి కృషి



సమావేశంలో పాల్గొన్న వారితో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: జిల్లాలో ముగ్గురు వీర వితంతువులు, ఇద్దరు వీరమాతలకు 300గజాల ఇంటి స్థలం పంపిణీ పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా సైనిక్ బోర్డు కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవో నంబరు 83 ప్రకారం మాజీ సైనికోద్యోగులకు ఇంటిపన్ను మినహాయింపు పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్లకు తగిన సూచనలు ఇస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాల నియామకాల్లో మాజీ సైనికోద్యోగులకు రెండు శాతం రిజర్వేషన్ పక్కాగా అమలుచేస్తామన్నారు. ఉద్యోగ విరమణ పొందిన సైనికులకు 2.5ఎకరాల సాగుభూమి లేదా ఐదెకరాల మెట్ట పొలం పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. పదేళ్ల దాటిన పట్టాలకు 22(ఏ) నుంచి తొలగించేందుకు తగిన ప్రతిపాదనలు పంపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సైనిక సంక్షేమ కార్యాలయ నిర్మాణానికి 90సెంట్ల భూమిని గుర్తించాలన్నారు. మాజీ సైనిక ఉద్యోగుల సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని హామీ ఇచ్చారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి ఆర్ గుణశీల, అదనపు ఎస్పీ ఆర్ రాఘవేంద్ర, నరసరావుపేట, సత్తెనపల్లి ఆర్డీవోలు ఎం.శేషిరెడ్డి, బీఎల్ఎస్ రాజకుమారి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కమాండింగ్ ఆఫీసర్ సీహెచ్.నవీన్‌రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ డైరక్టర్ ఐయం.స్వామి, మాజీ సైనికులు, సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ జువాలజీ, కెమిస్ట్రీ, ఎంఏ ఎకనామిక్స్, ఇంగ్లిష్, తెలుగు కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి, అర్హత గల విద్యార్థినులు దరఖాస్తు చేయాలని సూచించారు. పీజీలో ప్రవేశం పొందిన విద్యార్థినులకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన అందుతాయని, వీటితో పాటు అర్హులైన విద్యార్థినులు ప్రతిభా ఉపకార వేతనాలు పొందవచ్చని తెలిపారు. హాస్టల్ వసతి, ల్యాబ్ సౌకర్యం, డిజిటల్ తరగతిగదులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థినులు ఆయా సబ్జెక్టుల వారీగా ప్రవేశాల కోసం జువాలజీ (9246452235), కెమిస్ట్రీ (9985904415), ఎకనామిక్స్ (9440830278) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేషన్ బియ్యం నల్లబజారుకు తరలిపోకుండా చర్యలు

జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ

నరసరావుపేట: జిల్లాలో ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యం లబ్ధిదారుల ఇళ్లవద్దకే పకడ్బందీగా పంపిణీచేస్తూ అవి నల్లబజారుకు తరలిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ మంగళవారం పేర్కొన్నారు. బియ్యం తీసుకున్న లబ్ధిదారులు అవి ఉపయోగించకుండా అమ్ముకోవటం వలన ఆ బియ్యం రీసైకిల్ చేసి కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు తరలిపోతున్నాయంటూ పరదేశాలకు పేదోళ్ల బియ్యం అనే శీర్షికతో ఒక దినపత్రిలో (సాక్షికాదు) వచ్చిన వార్తను ఆమె ఖండించారు. ఇందులో ఎటువంటి వాస్తవంలేదన్నారు. జిల్లాలో ప్రతినెలా 8997 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 402 ఎండీయూ వాహనాల ద్వారా 6,36,802కార్డు దారులకు ఇళ్లవద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నామన్నారు. పంపిణీలో వేలిముద్రలు, ఈపాస్ విధానంతో లబ్ధిదారులకే అందజేస్తున్నామన్నారు. పంపిణీలో ఏదైనా అవకతవకలకు జరిగితే వెంటనే ఫిర్యాదుచేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1967 అందుబాటులో ఉంచామన్నారు. బియ్యం బయటి వ్యక్తులకు అమ్ముకోకుండా వివిధ రూపాల్లో ఉపయోగించుకొని మెరుగైన ఆరోగ్యం పొందేందుకు కార్డుదారుల్లో ఉండే అపోహలు తొలగించేందుకు పీడీఎస్ బియ్యంతో వివిధ రకాల పిండివంటల పోటీలు కలెక్టరేట్‌లో నిర్వహించటం జరిగిందన్నారు. తమ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు నిత్యం పంపిణీని పరిశీలిస్తున్నారన్నారు. ఆ పత్రికలో వచ్చిన వార్తల్లో ఎటువంటి నిజంలేదని పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో లివర్ మార్పిడి ఆపరేషన్లకు రంగం సిద్ధం

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. స్విమ్స్(తిరుపతి) నుంచి నలుగురు సభ్యులతో కూడిన బృందం మంగళవారం ఆస్పత్రిని సందర్శించింది. డాక్టర్ వి.వెంకట్రామిరెడ్డి, డాక్టర్ వి.వి.రమేష్ చంద్ర, డాక్టర్ అలోక్ సమన్తరీ, డాక్టర్ ఎస్.రుక్మమన్ గడలు జీజీహెచ్‌లోని సీటీవీఎస్ ఆపరేషన్ థియేటర్, బ్లడ్ బ్యాంక్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వార్డును పరిశీలించారు. థియేటర్లలో వసతులు, పరికరాలు అందుబాటులో ఉన్నాయో లేదోనని పరిశీలించారు. జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి చేసేందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ సందర్భంగా గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ త్వరలోనే కాలేయ మార్పిడి ఆపరేషన్లకు అనుమతి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవిందా నాయక్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో పరిశీలన చేస్తున్న లివర్ మార్పిడి నిపుణుల బృందం, పక్కన డాక్టర్ కిరణ్‌కుమార్

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



పవన్‌కుమార్ మృతదేహం

నరసరావుపేటటౌన్: ఇంటర్ విద్యార్థి ప్రైవేటు కళాశాల వసతి గృహంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన మోడి పవన్‌కుమార్(17) నరసరావుపేట పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ ఆ కళాశాలకు అనుబంధంగా ఉన్న హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆరోగ్యం బాగోలేదని, తనను ఇంటికి తీసుకువెళ్లాలని సోమవారం తల్లిదండ్రులకు ఫోన్ చేసి తెలిపాడు. తల్లిదండ్రులు రాకపోవటంతో మనస్తాపం చెంది హాస్టల్ 4వ అంతస్తుకు వెళ్లి టవల్‌తో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు హాస్టల్ వద్దకు చేరుకొని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్ఐ రహంతుల్లా సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని మంగళవారం బంధువులకు అప్పగించారు. మృతుడి తండ్రి శ్యామేల్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీబీసీ కాల్వలో పడి వ్యక్తి మృతి



మృతుడు గోపినాథ్

ముప్పాళ్ల: ప్రమాదవశాత్తూ కాల్వలో జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పలుదేవర్లపాడు గ్రామ సమీపంలోని గుంటూరు బ్రాంచి కాలువ(జీబీసీ) మలుపు వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమరావతి మండలం ధరణికోట కు చెందిన వేముల గోపీనాథ్(26) ద్విచక్ర వాహనంపై తన మిత్రుడు శ్యామ్‌ను పలుదేవర్లపాడులోని తన పిన్ని ఇంటివద్ద వదిలి ఇంటికి బయలుదేరాడు. మార్గంమధ్యలో జీబీసీ కాల్వపై మలుపు తిరిగే క్రమంలో గమనించక నేరుగా కాల్వలోకి జారి పడ్డాడు. తెల్లవారుజామున కాల్వకట్టపై ద్విచక్రవాహనం, కాల్వలో మృతదేహం పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు గోపినాథ్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నట్లు బంధువులు తెలిపారు. జరిగిన సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మినీ లారీని ఢీకొట్టిన ఆటో

ఐదుగురు మహిళలకు తీవ్రగాయాలు

వేటపాలెం: రోడ్డు పక్కన ఆగి ఉన్న మినీ లారీని వెనుక నుంచి వేగంగా ఆటో ఢీకొట్టడంతో ఐదుగురు మహిళలు తీవ్రంగా గాయపడిన ఘటన వేటపాలెం మండల పరిధిలోని 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో మంగళవారం జరిగింది. ఎస్ఐ జి.సురేష్ వివరాల మేరకు.. బాపట్ల మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన పదిమంది మహిళలు కనపర్తి వెళ్లడానికి ఆటోలో బయలుదేరారు. అయితే వేటపాలెం బైపాస్ వద్దకు వచ్చిన తరువాత రోడ్డు పక్కన ఆగి ఉన్న మినీ లారీని వేగంగా వచ్చిన ఆటో అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో రోడ్డు పక్కన మినీ లారీ పక్కకు పడిపోగా ఆటో పల్టీ కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న పదిమంది మహిళల్లో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్సు సహాయంతో గాయపడినవారిని చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు.



గాయపడిన మహిళలను 108 అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

అండర్ –19 ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో భవానీ దేవి, కోటేశ్వరమ్మ, తదితరులు

బాపట్ల అర్బన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ –19 విభాగంలో రైఫిల్ షూటింగ్, చెస్, రోప్ స్కిప్పింగ్, బాల బాలికల ఎంపికలు మంగళవారం స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జరిగాయి. ఉమ్మడి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికలను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భవానీదేవి ప్రారంభించారు. ఈ పోటీలలో ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా యు.ఉదయ భాస్కర్, ఎస్.సుధాకర్ రెడ్డి, పి.శాంతకుమారి, ఎం.గోపి, ఏఎంజీ రాజు, గురునాథ్, శ్రీహరి, ఎంఎస్‌కే మెహబూబి, ఎస్.కె. నాగుల్ మీరాబీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ గుంటూరు జిల్లా తరపున పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

చెస్ (బాలికల విభాగం): ఎం.జ్యోత్స్న (వి.పి.సౌత్), వి.మౌనిక (ఏఎంజీ), పి.మేఘన (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాపట్ల), కె.మేరీ గ్రేస్ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ అమరావతి), ఎం.పునీత, (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఆర్.కె.పి)

బాలుర విభాగం: బి.శివగోపికృష్ణ (ఏపీ మోడల్, వినుకొండ), ఎస్.బన్నీ రూపెస్, (విశ్వసాయి, వినుకొండ), ఎ.సూర్య తేజ (ఏఎంజీ, సిహెచ్ పేట), ఈహెచ్ఆర్ ఫణీంద్ర, (ఎస్.వి.ఆర్.ఎం, నగరం), వి.లోకేష్ నాయక్ (ఏఎంజీ, సిహెచ్ పేట)

రోప్ స్కిప్పింగ్ (బాలికల విభాగం): కె.బ్యూలా (వి.పి.సౌత్), ఎస్.కె. షాజహాన్ (వేగ దేవి ఎన్నార్ఐ), డి.మీరాబీ, (ఏఎంజీ సిహెచ్ పేట), కె.అనూష (ఏపీఎస్ బాపట్ల), ఎం.హారిక (ఏఎంజీ సిహెచ్ పేట),

బాలుర విభాగం : పి. ముఖేష్, యు. హరికృష్ణ, బాల వెంకట గోపీనాథ్, నజీర్, మనోజ్ కుమార్

వేర్వేరు కారణాలతో మహిళల ఆత్మహత్యాయత్నం

మార్టూరు: క్షణికావేశంలో ఇద్దరు వివాహిత మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈఘటన మండలంలోని బొల్లాపల్లి, ద్రోణాదుల గ్రామాల్లో మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. ద్రోణాదుల ఎస్టీ కాలనీకి చెందిన దేవరకొండ మధుమతి భర్తతో విడిపోయి ఇద్దరు పిల్లలు, తల్లితో కలిసి నివసిస్తోంది. ఈ క్రమంలో తల్లి మందలించిందనే కారణంతో మధుమతి ఇంట్లో ఉన్న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేయటంతో గమనించిన స్థానికులు ఆమెను మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిద్రమాత్రలు మింగి..

కుటుంబంలో జరిగిన కొద్దిపాటి వివాదంలో మనస్థాపానికి గురైన బొల్లాపల్లికి చెందిన మురికిపూడి గంగమ్మ నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యయత్నం చేసింది. స్థానికులు సమాచారంతో 108 సిబ్బంది మార్టూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.